## క్లుప్తంగా

### పింఛన్లపై విచారణ



పింఛన్‌దారులను విచారిస్తున్న డాక్టర్లు

**పెనగలూరు :** మండలంలో మంచంలో ఉన్న పింఛన్‌దారులపై మంగళవారం విచారణ చేపట్టారు. జిల్లా నుంచి ప్రత్యేకంగా వచ్చిన డాక్టర్ ప్రతాప్, డాక్టర్ కృష్ణ చైతన్యల ఆధ్వర్యంలో విచారణ జరిపినట్లు ఎంపీడీఓ విజయారావు తెలిపారు. మండల వ్యాప్తంగా 16 పంచాయతీలలో రూ. 15 వేలు పింఛన్లు తీసుకున్న వారు 30 మంది ఉన్నారని చెప్పారు. వీరి ప్రస్తుత స్థితిపై విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన ఉండాలి

**నందలూరు :** విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఏఎస్‌ఐ శంకర్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం మహాత్మ జ్యోతిబా పూలే బాలికల గురుకుల కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలపై దాడులు, మహిళల కోసం ప్రత్యేకంగా ఉన్న చట్టాలు, డ్రగ్స్, సైబర్ క్రైమ్ తదితర నేరాలు గురించి వివరించారు. అలానే విద్యార్థినులు, మహిళల చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్.నాగేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ఉరుసు ఉత్సవం



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

**సిద్దవటం :** మండల కేంద్రంలోని బత్తేరు కట్ట వద్ద వెలసిన హజరత్ మస్తుమియ్యా వలీ దర్గా ఉరుసు మహోత్సవాన్ని మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా వద్ద అన్ని వర్గాల ప్రజలు పూజలు చేసి ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం ఉరుసు మహోత్సవాన్ని నిర్వహించి నిర్వాహకులు వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

### వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాచుపల్లెలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

**సిద్దవటం :** వరిలో నారు యాజమాన్యం, సాగు నీటి సద్వినియోగం, సస్యరక్షణ చర్యలు సకాలంలో చేపట్టాలని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) నాగరాజ తెలిపారు. మండలంలోని మాచుపల్లె గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు గ్రామ సభ నిర్వహించి అనంతరం క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఏడీఏ మాట్లాడుతూ రబీలో వరి, నువ్వులు, కూరగాయలు, వేరుశనగ వంటి పంటలను రైతులు సాగు చేస్తున్నారన్నారు. వరిలో కాలిబాటలు, నారు కొనలు తుంచి నాటడం, జిగురు పూసిన పసుపు, తెలుపు నీలం పల్లాలు, లింగాకర్షక బుట్టలు అమర్చడం తెలిపారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబించాలని సూచించామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, రైతుసేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు లక్ష్మీదేవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చిన్నక్క, బాగ్యలక్ష్మి, లక్ష్మీదేవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### పవన్‌కల్యాణ్‌కు భద్రత పెంచాలి



మాట్లాడుతున్న రామ శ్రీనివాసులు

**రాయచోటి అర్బన్ :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు వెంటనే భద్రతను పెంచాలని జనసేన జిల్లానేత, రాయలసీమ జిల్లాల జాతీయ కాపు సంఘం ప్రధాన కార్యదర్శి రామ శ్రీనివాసులు కేంద్రప్రభుత్వాన్ని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొద్దిరోజుల క్రితం అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లాలో జరిగిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటనలో ఒక నకిలీ ఐపీఎస్ అధికారి ఆయన పక్కనే తిరగడం ఆందోళనను కలిగిస్తోందన్నారు. ఇదే సమయంలో డిప్యూటీ సీఎం ఓఎస్‌డీ, వ్యక్తిగత సిబ్బందికి అపరిచితుల నుంచి బెదిరింపు కాల్స్‌రావడం, ఆయన క్యాంపు కార్యాలయంపై డ్రోన్ కెమెరాలు ఎగురవేయడం వెనుక అంతర్యం ఏమిటంటూ ఆయన ప్రశ్నించారు. కేంద్రప్రభుత్వ పెద్దలు వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుని పవన్‌కల్యాణ్‌కు తక్షణమే జడ్ ప్లస్ కేటగిరి రక్షణను కల్పించాలంటూ కోరారు. సమావేశంలో జనసేన నేతలు బుల్లెట్ విజయ్, రెడ్డిప్రసాద్, వెంకటేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# అనుకూల వాతావరణం.. పెరిగిన విస్తీర్ణం

- బొప్పాయి సాగుపై రైతన్నల ఆసక్తి
- సకాలంలో సస్యరక్షణ చర్యలతో లాభాలు పొందవచ్చంటున్న అధికారులు
- దళారుల బెడద లేకుండా చూడాలని రైతుల విజ్ఞప్తి

| నియోజకవర్గం | బొప్పాయి (ఎకరాలు) |
| --- | --- |
| కోడూరు | 3109 |
| రాయచోటి | 2030 |
| రాజంపేట | 445 |



నర్సరీలో విక్రయానికి సిద్ధంగా బొప్పాయి మొక్కలు



విస్తారంగా నాటిన బొప్పాయి (ఇన్‌సెట్) తెగుళ్లు సోకిన బొప్పాయి మొక్క

**రైల్వేకోడూరు అర్బన్ :** అన్నమయ్య జిల్లాలోని రైల్వేకోడూరు, రాయచోటి, రాజంపేట నియోజకవర్గాలలో రైతులు ఈ ఏడాది కొండంత ఆశతో బొప్పాయి పంటను విస్తారంగా సాగు చేస్తున్నారు. ఈ ప్రాంత బొప్పాయి వివిధ రాష్ట్రాల్లో డిమాండ్ ఉండటంతో రైతులు వీటి సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం రైతులకు వాతావరణం (పొగ మంచు) పెద్ద సమస్యగా తయారైంది. వాతావరణం అనుకూలిస్తే మాత్రం రైతుకు లాభాలు చూడనున్నారు. సెప్టెంబర్ చివరి నుంచి జనవరి నెల వరకు వరకు బొప్పాయి సాగుకు సానుకూలంగా ఉండటంతో ఇప్పటికే చాలా చోట్ల రైతులు బొప్పాయి మొక్కలను వేసుకోగా మరికొందరు ప్రస్తుతం ఆయా పనుల్లో నిమగ్నమయ్యారు. అలానే కొందరు రైతులు పలు నర్సరీల్లో బొప్పాయి మొక్కలను కొనుగోలుచేసి పంటను వేసుకునేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. కాగా గత రెండు సంవత్సరాలుగా బొప్పాయి సాగు చేసిన రైతులకు వాతావరణం అనుకూలించకపోవడంతో దిగుబడి రాకపోవడంతోపాటు దళారుల దగా కారణంగా నిరాశే మిగిలింది. దీంతో ఈ ఏడాది బొప్పాయి పంటలో లాభాలు వస్తాయని ఆశతో ఉన్నారు. మూడు నియోజకవర్గాల్లోని అన్ని మండలాలలో బొప్పాయి మొలకలు అధిక ధరలతో కొనుగోలు చేసి సాగుకు సమాయత్తం అవుతున్నారు. దీనికి తోడు నాటిన నాటి నుంచి పంట చేతికి వచ్చే వరకు ఎకరాకు రైతుకు సరాసరి 60 వేల రూపాయల వరకు పెట్టుబడి కింద ఖర్చు అవుతుంది. గతంతో పోలిస్తే ఏ సంవత్సరం అధిక విస్తీర్ణంలో బొప్పాయి సాగు అయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు.

**తెగుళ్లను అధికమించడానికి సస్యరక్షణ తప్పనిసరి**

బొప్పాయి పంట చేతికి వచ్చే దశలో తెగుళ్ల నుంచి కాపాడుకోగలిగితే రైతులకు ఎకరాకు లక్ష పైనే ఆదాయం వస్తుంది. గత ఏడాది బొప్పాయి రైతులకు నష్టాలే మిగిలాలి. ఇప్పటికే బొప్పాయి నాటుకున్న రైతుల పంటల్లో నులి పురుగు, వేరు కుళ్లు, ఆకు ముడత, బూజు పురుగు వంటి తెగుళ్లు పంటను నాశనం చేస్తున్నాయి. వీటిని అధికమించడానికి రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదిస్తూ వారి సూచనల మేరకు మందులు పిచికారీ చేయాలి. అలాగే నీటి, ఎరువుల వాడకంపై అధికారుల సలహాలు తీసుకోవాలి.

**రైతులకు బహుముఖ ప్రయోజనాలు**

బొప్పాయి పంటను సాగుచేసే రైతులకు బహుముఖ ప్రయోజనాలు ఉన్నాయి. రైతులకు పంట బాగా చేతికి వస్తే మంచి లాభాలు ఉంటాయి. బొప్పాయి పంట మొదటి, రెండవ సారి కోతకు లాభాలు వస్తాయి. అలాగే మూడవ దఫా పంట కోతను బొప్పాయి పాలకు, టూటీ - ఫ్రూటీ తయారీకి ఉపయోగించే బొప్పాయి ఫ్యాక్టరీలకు ఎగుమతి చేయవచ్చు. వీటికి ప్రతి రోజు టన్నుల్లో కాయలు అవసరమవుతాయి. ఫ్యాక్టరీ వాళ్లు రైతుల నుంచి టన్ను 1500 రూపాయల నుంచి 2000 వరకు కొనుగోలు చేసి వాటి ముక్కలను ఉప్పులో నాన బెట్టి టన్ను 3000 రూపాయలకు బెంగళూరు, చెన్నై, విజయవాడ తదితర ప్రాంతాలలోని టూటీ ఫ్రూటీ ఫ్యాక్టరీలకు ఎగుమతి చేస్తుంటారు. ఇలా రైతులకు బొప్పాయి పంటతో మూడు దశల్లో ఆదాయం వస్తుంది.

**ధరలు పెరిగినా లాభం రావడంలేదు**



బొప్పాయి పంటలు గత సంవత్సరం గాలికి పూర్తిగా దెబ్బ తిన్నాయి. ఈ ఏడాది బొప్పాయి పంటకు ధర బాగా ఉంటుందని 3 ఎకరాలలో పండిస్తున్నాను. రెండు సంవత్సరాలు నష్టాలు వస్తే ఒక్క సంవత్సరం మాత్రమే లాభాలు వస్తున్నాయి. ఆ లాభాలు కూడా పెరిగిన ధరలా కాకుండా సాధారణంగా ఇస్తున్నారు. ప్రకృతి కూడా అనుకూలిస్తే లాభాలు చూడొచ్చు.

– ఏలూరి రమణయ్యనాయుడు, రైతు, రాజంపేట మండలం

**ప్రభుత్వం చొరవచూపాలి**



బొప్పాయి పంటను పండించే రైతులకు ప్రభుత్వం సబ్సిడీ ముందుగా ప్రకటించాలి. ఈ ప్రాంతంలో బొప్పాయిని అధికంగా పండిస్తుంటారు. బొప్పాయి పంట చేతికి వచ్చే దశలో తెగుళ్ల నుంచి కాపాడుకోవడానికి రైతులకు సలహాలు ఇచ్చేలా అధికారులు అందుబాటులో ఉండాలి. రైతులపై భారం వేయకుండా గత ప్రభుత్వం లాగా కూటమి ప్రభుత్వం ఇన్సురెన్స్ ప్రీమియంను చెల్లించాలి.

– ముద్దులూరు సుబ్బరామరాజు, మార్కెట్ చైర్మన్, రైల్వేకోడూరు మండలం

**దళారుల మోసాలతో నష్టపోతున్నాం**



ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికొచ్చి మార్కెట్ చేరే వరకు ధరపై స్పష్టత ఉండదు. అక్కడికక్కడే దళారులు ధర ఇంత అని తెలియజేసి రైతులను నష్టాల బాట పట్టేలా చేస్తారు. దీంతో అప్పుల కూపంలో రైతులు మునిగే పరిస్థితి ఉంటోంది. ప్రతి పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధరలను ప్రకటిస్తే రైతుకు మంచి చేసిన వారు అవుతారు. దీంతో పెట్టుబడులు పోయి లాభాలు పొందచ్చు.

– సురేష్, బొప్పాయి రైతు, పుల్లంపేట మండలం

**సస్యరక్షణలు పాటించాలి**



రైతులు బొప్పాయి మొక్కలు నాటే సమయంలో సస్యరక్షణలు పాటించాలి. 1.5 అడుగుల గుంతలో కొంత పశువుల ఎరువు, సూపర్ పాస్పేట్ 10 గ్రాములు, కార్బోసిరాన్ గ్రాన్యుల్స్ 5 గ్రాములు వేసి నీరు పెట్టాలి తరువాత మొక్కలు నాటాలి. తెల్లదోమ, రసం పీల్చే పురుగుల నుంచి కాపాడుకోవడానికి అధికారుల సలహాల మేరకు మందులు పిచికారీ చేయాలి. నులి పురుగులు వేరు వ్యవస్థ నుంచి వ్యాప్తి చెంది చెట్టు ఎదగకుండా చేస్తుంది. మొక్కలు నాటే ముందు గుంతలో వేపపిండి వేసి పురుగు రాకుండా చేయవచ్చు.

– వెంకటభాస్కర్, ఉద్యానవన అధికారి, రైల్వేకోడూరు

### రీ సర్వే పనులు వేగవంతం చేయండి



రీ సర్వే రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వైఖోమ్

**ఓబులవారిపల్లె :** వ్యవసాయ భూముల రీసర్వే పనులను వేగవంతం చేయాలని సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియా దేవి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం నూకనపల్లి రెవెన్యూ పరిధిలో నిర్వహిస్తున్న భూముల సర్వే పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి ప్రతిరోజూ ఒక్కో టీమ్ 20 ఎకరాలు చొప్పున సర్వే చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నూకనపల్లె రెవెన్యూ పరిధిలో దాదాపు 77 ఎకరాల వ్యవసాయ భూములకు సంబంధించి రీసర్వే జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్ రావు, సర్వేయర్ నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

### చీడపీడల పర్యవేక్షణకు 'నప్స్'



రైతులతో మాట్లాడుతున్న ఏఓ నాగమణి

**రామాపురం :** పంటలను ఆశిస్తున్న చీడపీడల పర్యవేక్షణకు నప్స్ యాప్ ఎంతో దోహదపడుతుందని మండల ఏఓ నాగమణి తెలిపారు. మండలంలోని నల్లగుట్టపల్లె, సరస్వతిపల్లె గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పాల్గొన్న ఏఓ మాట్లాడుతూ నేషనల్ పెస్ట్ సర్వేలెన్స్ సిస్టమ్(ఎన్‌పీఎస్‌ఎస్) యాప్‌తో పంటలలో చీడపీడల పర్యవేక్షణ సులభతరం అవుతుందని రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల పండించిన మిరప, అలసంద, పంటలలో చీడపీడలను ఈ యాప్ సహాయంతో ఎలా గుర్తించవచ్చో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, లక్ష్మీదేవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

# కష్టాల్లో కార్యకర్తలకు తోడుంటా



రామాపురం: ప్రజలు, రైతులతో మమేకమైన మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



చిన్నమండెం: కార్యకర్తలతో మాట్లాడుతున్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి

**చిన్నమండెం :** వైఎస్‌ఆర్‌సీపీ బలోపేతానికి అందరం కలసికట్టుగా పని చేద్దామని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. చిన్నమండెం మండలం వండాడి గ్రామం కదిరివాండ్లపల్లెలో గ్రామ వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ దేవనాథరెడ్డితో కలిసి శ్రీకాంత్‌రెడ్డి సమావేశమయ్యారు. కార్యకర్తలు, నాయకులకు ఏ కష్టం వచ్చినా తోడుంటామని భరోసానిచ్చారు. పార్టీ బలోపేతంపై శ్రీకాంత్‌రెడ్డి, దేవనాథరెడ్డిలు చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్ ముసల్‌రెడ్డి, సీనియర్ నాయకులు రంగారెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సేట్ వెంకట్రామిరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ చుక్కా అంజనప్ప, ప్రభాకర్‌రెడ్డి, రామాంజులురెడ్డి, బయారెడ్డి, గఫూర్, ధనుష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**దిన్నెపాడులో..**

**లక్కిరెడ్డిపల్లి :** కూటమి ప్రభుత్వంలో రైతులు, వ్యవసాయ కూలీలు అవస్థలు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దిన్నెపాడు కస్బాలో గ్రామస్తులు, రైతులు, కార్యకర్తలతో ఆయన మమేకమయ్యారు. మండలంలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, నీరు లేక రైతులు, కూలీలకు పనులు తగ్గాయన్నారు. ప్రభుత్వం రైతులకు పెట్టుబడి నిధి అందించకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పాల రైతులకు రూ.10 తగ్గించి పాలు కొనుగోలు చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం దిన్నెపాడులో మూడు రోజుల క్రితం మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పఠాన్ దర్బార్ ఖాన్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. అలానే ఆనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న పఠాన్ శిలార్ ఖాన్ ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బేగంవలీ, ఉప సర్పంచ్ రఫీ, వైఎస్సార్‌సీపీ నాయకులు మీరావలీ, పఠాన్ రఫీఖాన్, గంగిరెడ్డి, జయ, రామకృష్ణ, రెడ్డిశేఖర్, సాహెబ్‌పీర్, హబీబుల్లా ఖాన్, యుసూబ్, అష్రఫ్, నవాజ్ అలీ, బాబ్జీ పాల్గొన్నారు.

**గువ్వలచెరువులో..**

**రామాపురం :** మండంలోని గువ్వలచెరువులో మంగళవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి పర్యటించారు. ప్రజలతో ఆయన మమేకమయ్యారు. పేరు పేరునా ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ప్రజలు, రైతులు శ్రీకాంత్‌రెడ్డిని కలిసి సరైన వర్షాలు లేక పంటలు దెబ్బతింటున్నాయని, వ్యవసాయ కూలీ పనులు తగ్గాయని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బాషాఖాన్ ప్రమాదానికి గురై శస్త్ర చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. శ్రీకాంత్‌రెడ్డి ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శివయ్య, సుబ్బయ్య, ఆయూబ్, ఎంపీటీసీ మౌలా, మాజీ సర్పంచ్ జిలాన్, రేఖం నారాయణ, మాజీ ఎంపీటీసీ రాజా, ఉప సర్పంచ్ శివ, ముబారక్, బంకు సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే సమస్యలు పరిష్కరించండి



డీఆర్‌ఎంకు వినతిపత్రం అందజేస్తున్న తల్లెం భరత్

**ఓబులవారిపల్లె :** రాజంపేట పార్లమెంట్ పరిధిలోని రైల్వే సమస్యలు పరిష్కరించాలని డీఆర్‌యూసీసీ మెంబర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తాకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం గుంతకల్లులోని రైల్వే డీఆర్‌ఎం కార్యాలయంలో ఈ మేరకు వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ రైల్వే కోడూరు రైల్వేస్టేషన్ అభివృద్ధికి సహకరించాలని, చైన్నై – మంబైకు సంబంధించిన రైలుకు స్టాపింగ్ కల్పించాలని కోరారు. పేద ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉన్న ఇంటర్ సిటీ ప్యాసింజర్ రైలును రద్దు చేయడంతో ఇబ్బందులు పడుతున్నారని, ఇంటర్ సిటీ ప్యాసింజర్ రైలు సమయంలో డెమో ప్యాసింజర్ రైలును తిరుపతి నుంచి గుంతకల్ వరకు నడిపించాలని కోరారు. నంద్యాల డెమో ప్యాసింజర్ రైలుకు పుల్లంపేట, అనంతరాజుపేట, శెట్టిగుంట రైల్వేస్టేషన్‌లలో స్టాపింగ్ కల్పించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న ప్యాసింజర్ రైళ్లలో రద్దీని పరిగణనలోకి తీసుకొని మరికొన్ని ప్యాసింజర్‌లను ప్రవేశపెట్టాలన్నారు. ఓబులవారిపల్లి నుంచి కృష్ణపట్నం రైలు మార్గంలో నెల్లూరుకు, కడప నుంచి ప్యాసింజర్ రైలును ప్రవేశపెట్టాలని విన్నవించారు. ఇందుకు డీఆర్‌ఎం సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలియజేశారు.

# సమాజాభివృద్ధికి విద్యే మూలాధారం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

**రాజంపేట టౌన్ :** సమాజాభివృద్ధికి విద్యే మూలాధారమని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక కాకతీయ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన ఆ కళాశాల ఫేర్ వెల్ డే కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సమయం ఆసన్నమైందని అందువల్ల ప్రతి విద్యార్థి సమయాన్ని వృథా చేయకుండా బాగా చదివి అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. ఇంటర్మీడియట్ జీవితానికి ఓ మలుపులాంటిదన్న విషయాన్ని ప్రతి విద్యార్థి గుర్తుంచుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్ తరువాత విద్యార్థులు వివిధ కోర్సులను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందని, అందువల్ల విద్యార్థులు తమ భవిష్యత్తుకు ఉపయోగపడే కోర్సులను ఎంపిక చేసుకొని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని తెలిపారు. దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రవేశ పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వల్ల పేద విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేందుకు అవకాశం కలిగిందని, అందువల్ల పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వసతి దీవెన పథకాన్ని కూటమి ప్రభుత్వం కొనసాగించాలని చెప్పారు. ఎమ్మెల్యే తొలుత కాకతీయ విద్యాసంస్థల అధినేత పోలా రమణారెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోలా రమణారెడ్డి, చొప్పా ఎల్లారెడ్డి, డైరెక్టర్ పోలా సాయివైభవ్‌రెడ్డి, వైష్ణవి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఈశ్వరయ్యనాయుడు, కాకతీయ కళాశాల ప్రిన్సిపల్ శిరీష్‌రెడ్డి పాల్గొన్నారు.

# పాడి రైతులు జాగ్రత్తలు పాటించాలి



వీరబల్లి: పశువులకు చికిత్స చేస్తున్న పశు వైద్యులు నాగరాజు, సిబ్బంది

**వీరబల్లి :** పాడి రైతులు జాగ్రత్తలు పాటిస్తే పశువులను వ్యాధుల బారిన పడకుండా రక్షించుకోవచ్చునని మండల పశు వైద్యాధికారి డాక్టర్ నాగరాజు సూచించారు. మండలంలో మంగళవారం వీరబల్లి పంచాయతీ నాయనవారిపల్లెలో పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ముందుగా రైతులకు చలికాలంలో వచ్చే వ్యాధులపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. అలానే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరంగా తెలియజేశారు. అనంతరం పశువులకు గర్భకోశ చికిత్సలు, కృత్రిమ గర్భధారణ, ఆవులు, గేదెలు, దూడలలో గొర్రెలు, మేకలలో వచ్చే నట్టల వ్యాధికి నివారణ మందులు వేశారు. ఈ కార్యక్రమంలో వీఎల్‌ఓ జయప్రకాష్, వైద్య సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**పశువుల పరిరక్షణకే వైద్య శిబిరాలు**

**రాజంపేట రూరల్ :** గ్రామీణ ప్రాంతాలలో ఉన్న పశువుల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ వై.విజయబాస్కర్‌రావు కోరారు. మండల పరిధిలోని పోలీ, ఎంజీ పురం గ్రామ పంచాయతీ పరిధిలలో మంగళవారం పశు ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న వై.విజయబాస్కర్‌రావు గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె.ప్రతాప్ పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేశారు. ఈ కార్యక్రమంలో అత్తిరాల పశువైద్య కేంద్రం డాక్టర్ వై.భాగ్యవతి. జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ఎం.వరదయ్య, వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ యు.ఆనందబాబుతో పాటు టి.వెంకటసుబ్బయ్య, ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**రామాపురం :** మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ బి.రాచపల్లె, కర్ణపువాండ్లపల్లె గ్రామాలలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొని మేకలకు, గొర్రెలకు నట్టాల నివారణ మందులను అందించారు. 2,646 గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులను వేశారు. పశు యజమానులకు వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### పోస్టర్ల ఆవిష్కరణ



వైద్య శిబిరాలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేస్తున్న అధికారులు

**పుల్లంపేట :** మండల పరిధిలోని అనంతంపల్లి పంచాయతీ చాపల దళితవాడ గ్రామంలో మంగళవారం డాక్టర్ కె.వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 12 పశువులకు చికిత్స అందించారు. పాడి రైతులకు ప్రభుత్వం ఉచితంగా పశుగ్రాసం పెంచుకునేందుకు జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా నగదు మంజూరు చేస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాడి రైతులు వెన్న శాతం తగ్గకుండా చేపట్టాల్సిన చర్యలను వివరించారు. మండలంలో అన్ని గ్రామాల్లో జరిగే ఉచిత వైద్య శిబిరాలను పాడి రైతులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది రాణి, తనూజ, రమణ, తదితరులు పాల్గొన్నారు.

### అంజన్నకు పూజలు

**పుల్లంపేట :** మండల పరిధిలోని పెరియవరం కోట గడ్డ వద్ద వెలసిన శ్రీ అభయాంజనేయస్వామికి మంగళవారం పూజారి శివశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అలానే చిన్నంపల్లి గ్రామానికి చెందిన ఈరపు రాజు నాగేంద్రరాజు దంపతులు స్వామికి ఆకుపూజ చేయించి నూట ఒక్క టెంకాయలు కొట్టి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

### ఆడబిడ్డల చదువు కుటుంబానికే వెలుగు



విద్యార్థినులకు ప్రశంసా పత్రాలను అందజేసిన మానవత సభ్యులు, ఉపాధ్యాయులు

**రాయచోటి జగదాంబసెంటర్ :** ఆడబిడ్డలు చదువుకుంటే ఆ కుటుంబమే బాగుపడుతుందని, ఆడబిడ్డల చదువు విషయంలో నిర్లక్ష్యం వద్దని మానవత సంస్థ చైర్మన్ ఆరమాటి శివగంగిరెడ్డి, గౌరవాధ్యక్షులు వెంకటరమణ, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు షమీమ్ అంజుమ్‌లు అన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్‌లో మానవత సెక్రటరీ అంకం జయచంద్రారెడ్డి అధ్యక్షతన నైతిక విలువలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నైతిక విలువలు చాలా కీలకంగా వ్యవహరిస్తాయని, విద్యార్థులకు వాటిపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులను కోరారు. అనంతరం విలువలతోపాటు క్రమశిక్షణ కలిగిన ముగ్గురు పదో తరగతి విద్యార్థినులు ఎల్.భవ్యశ్రీ, వి.ప్రవల్లిక, సనాలకు నగదు ప్రోత్సాహకాలతోపాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మానవత కన్వీనర్ వెంకట్రామిరెడ్డి, డైరెక్టర్లు సుదర్శన్‌రెడ్డి, బీవీ నాగయ్య, రామచంద్రారెడ్డి, కోశాధికారి మురళీమోహన్, బోధనేతర సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ శంకర్ నాయక్

**నందలూరు :** తోపుడు బండ్ల వారు, రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునేవారు, ఆటోలు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని ఏఎస్‌ఐ శంకర్ నాయక్ హెచ్చరించారు. మంగళవారం ఆయన బస్టాండ్ నందు వాహనదారులు, ఆటో నడుపుతుండే వారికి ట్రాఫిక్ నిబంధనలు, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించమని, లైసెన్సుపై అవగాహన కల్పించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తినప్పుడు నేరుగా పోలీసులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రామరాజు, హోంగార్డు మేరీ తదితరులు పాల్గొన్నారు.



ఆంజనేయ స్వామి ఆలయం ముందు నిలిచిన మురుగునీరు

### ఆంజనేయా.. మన్నించు!

మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి గుడి ముందు మురుగునీరు పారుతుంది. చాలా రోజుల నుంచి కాలువ నిండి మురుగునీరు కాలువ పైనుంచి పారుతోంది. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఆలయానికి వస్తున్న భక్తులు మురుగునీటి దుర్గంధంతో అగచాట్లు పడుతున్నారు. పంచాయతీ అధికారులు సిబ్బంది సమస్య గురించి తెలిసినా పట్టించుకున్న పాపాన పోలేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి గుడి ముందు నిలుచున్న మురుగునీటిని తొలగించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

– ఓబులవారిపల్లె